చెంగిచర్లలో గ్రేడింగ్ బెల్ట్ టెస్ట్ పోటీలు



గ్రేడింగ్ బెల్ట్ టెస్ట్ పోటీల్లో విద్యార్థులు

బోడుప్పల్: చెంగిచర్ల విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలో సన్ ఫైటర్ కుంగ్‌ఫూ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో గ్రేడింగ్ బెల్ట్ టెస్ట్ పోటీలు నిర్వహించారు. 30 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో శేఖర్ యాదవ్, రిషిత్ యాదవ్, వశీకరణ్‌రెడ్డిలు మెరూన్ బెల్ట్‌లు, షాహిద్ బాషా, సావయ్య, ఝాన్సీ, సాత్విక్‌గౌడ్‌లు బ్లూ బెల్ట్‌లు, రిత్విక్, సాయి, శశికాంత్, భవ్య, వరుణ్, గ్రీన్ బెల్ట్‌లు, నవనీత్, తోఫిక్, శివసాయి, పరమేశ్వర్‌గౌడ్‌లు ఆరెంజ్ బెల్ట్‌లను సాధించినట్లు మాస్టర్ నంద ప్రసాద్ యాదవ్ వెల్లడించారు. ఈ సందర్భంగా నంద ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని సూచించారు.

అందరూ చదువు ప్రాధాన్యం తెలుసుకోవాలి



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీవల్లి

బోడుప్పల్: సమాజంలో ప్రతి ఒక్కరూ చదువు ప్రాధాన్యం తెలుసుకుని ఆ దిశగా అడుగులు వేయాలని ప్రముఖ విద్యావేత్త శ్రీవల్లి అన్నారు. బోడుప్పల్ ఇందిరానగర్ కాలనీలోని న్యూటన్ గ్రామర్ స్కూల్‌లో కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువును ఆధునిక పద్ధతిలో అందరికీ అర్థమయ్యే రీతిలో బోధన జరగాలన్నారు. 10వ తరగతి విద్యార్థులకు గణితంలో సులువైన బోధన పద్ధతులను ఆమె వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కె.రాంచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ కృష్ణ, ఇన్‌చార్జులు జయశ్రీ, మిస్సరాణి, లూసి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయం



క్రిస్మస్ కేకును కట్ చేస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: ఏసు క్రీస్తు బోధనలు ఆచరణీయమని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలోని బాబానగర్, జనప్రియ టౌన్‌షిప్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ శాంతి దూత అయిన ఏసుక్రీస్తు పుట్టిన రోజును ప్రపంచవ్యాప్తంగా కొన్ని కోట్ల మంది భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని గుర్తు చేశారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేశారు. పాస్టర్లు అభిషేక్, జాన్, అంజి, పొన్నాల మహేందర్, రాజు, దేవా, మధు ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్‌కు ఎంఎంటీఎస్ ఏర్పాటు చేయాలి

మల్కాజిగిరి: ఉందానగర్ నుంచి ఎయిర్‌పోర్ట్‌కు ఎంఎంటీఎస్ ఏర్పాటు చేయడం వలన ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని, తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి డీఆర్‌యూసీసీ సభ్యుడు, ప్రయాణికుల సంఘం ప్రధాన కార్యదర్శి నూర్ విజ్ఞప్తి చేశారు. ఎంపీగా రేవంత్‌రెడ్డి ఉన్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా ప్రాజెక్ట్‌కు నిధులు, భూమి ఇవ్వలేదన్నారు. కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. జీఎంఆర్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు జరిపి భూమి కేటాయించేలా చూస్తే ఎంఎంటీఎస్ మెట్రో రెండూ ఒకే దగ్గర అందుబాటులో ఉండేలా చూడవచ్చన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం అజంతా ఎక్స్‌ప్రెస్‌ను కాచిగూడ, లింగంపల్లి నుంచి దేవగిరి ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించడంపై నూర్ హర్షం వ్యక్తం చేశారు.

'త్రివేణి'లో అమ్మ, నాన్న, గురువు పద్యార్చన



అల్వాల్: అల్వాల్ త్రివేణి పాఠశాలలో అమ్మ, నాన్న, గురువు పద్యార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా, 100 దేశాల్లోని వందకుపైగా తెలుగు సంఘాల సమన్వయంతో వందే విశ్వమాతరమ్ పేరుతో చిగురుమళ్ల శ్రీనివాస్ 100 దేశాల్లో నిర్వహిస్తున్న శాంతి సద్భావన యాత్రలో భాగంగా అమ్మ, నాన్న, గురువు శతక పద్యార్చన కార్యక్రమాన్ని తానా నిర్వహిస్తోందని తానా అధ్యక్షుడు నిరంజన్ శృంగవరపు, తానా పూర్వ అధ్యక్షుడు జయశేఖర్ తాళ్లూరి తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 10 లక్షల మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు



సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: క్రిస్మస్ వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మచ్చబొల్లారం డివిజన్‌లోని జేసీహెచ్ఎల్ఎం చర్చిలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. పాస్టర్ ప్రశాంత్ కుమార్, నాయకులు డోలి రమేష్, పరమేష్, పవన్ తదితరులు ఉన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



అభివృద్ధి పనుల్లో కార్పొరేటర్ గున్నాల సునీత యాదవ్

మౌలాలి: మౌలాలి డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ గున్నాల సునీత శేఖర్ యాదవ్ అన్నారు. సోమవారం మౌలాలి డివిజన్ పరిధిలోని ప్రగతినగర్, మారుతీనగర్‌లలో ఆమె రూ.17.50 లక్షలు, రూ.4 లక్షల వ్యయంతో చేపట్టిన యూజీడీ పైపులైన్ పనులను ఆమె ప్రారంభించారు.

గృహలక్ష్మి ఉన్నట్టా.. లేనట్టా..?

- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంపై ఎదురుచూపులు
- బీఆర్ఎస్ హయాంలోని లబ్ధిదారుల్లో అయోమయం
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 17,090 దరఖాస్తులు
- ఎన్నికలకు ముందు మంజూరు పత్రాలు జారీ
- మాజీ మంత్రి ఏరియాలోనే 1200 మంజూరు పత్రాలు
- లబ్ధిదారుడికి రూ.3 లక్షలు ప్రకటించిన గత ప్రభుత్వం



గృహలక్ష్మీ మంజూరు పత్రాలను అందజేస్తున్న అప్పటి మంత్రి మల్లారెడ్డి (ఫైల్)

సాక్షి, మేడ్చల్ జిల్లా: గత ప్రభుత్వం హయాంలోని గృహలక్ష్మి లబ్ధిదారుల్లో అయోమయం నెలకొంది. పథకంలో లబ్ధికి గతంలో తీసుకున్న దరఖాస్తులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదం తెలుపుతుందా..? లేక ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మళ్లీ స్వీకరిస్తారా..? అలా అయితే ఇప్పటికే ఎంపిక ప్రక్రియ పూర్తిచేసి, కొందరికి మంజూరు పత్రాలు అందజేసిన చోట ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది. అనే సందేహాలు సంబంధిత వర్గాల్లో వ్యక్తం అవుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం నియోజకవర్గానికి 3 వేల ఇళ్ల చొప్పున మొదటి విడతగా మంజూరు చేస్తామని.. అప్పట్లో దరఖాస్తులు స్వీకరించింది. అంతలోనే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం.. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. దీంతో దరఖాస్తు చేసుకున్న వారిలో గృహలక్ష్మీపై ఆందోళన నెలకొంది. జిల్లాలో అర్హులను గుర్తించి కొందరికి మంజూరు పత్రాలను కూడా పంపిణీ చేశారు. అయితే బీఆర్ఎస్ పాలనలో మొదట్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం పథకం అంతగా ముందుకు సాగకపోవడంతో.. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో «గృహలక్ష్మి» పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ నేపథ్యంలో సొంతస్థలం ఉన్నవారికి ఇళ్ల నిర్మాణానికి విడతల వారీగా రూ.3 లక్షల నగదు ఇస్తామని చెప్పి దరఖాస్తులు స్వీకరించింది. ఇంతలోనే ప్రభుత్వం మారడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది.

మేడ్చల్ జిల్లాలో 17,090 దరఖాస్తులు

సొంత స్థలం ఉంటే ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షలు మంజూరు చేస్తామని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించడంతో.. జిల్లాలో చాలామంది ప్రజలు ముందుకొచ్చి దరఖాస్తులు చేసుకున్నారు. ఒక్కో లబ్ధిదారుడికి మూడు విడతల్లో రూ.3 లక్షల నగదు సాయం ప్రకటించింది. గడువు తక్కువగా ఉండటంతో కావాల్సిన ధ్రువపత్రాలు పొందడానికి కష్టాలు పడ్డారు. జిల్లాలో మొత్తం 17,090 దరఖాస్తులు రాగా, క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బందితో సహా ఇతర సిబ్బంది పరిశీలించారు. వీటిలో కొంత మందిని అర్హులుగా తేల్చి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో అప్పటి ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు ఇవ్వగా, మాజీ మంత్రి మల్లారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ఒక్క మేడ్చల్ నియోజకవర్గంలోనే 1200 మందికి మంజూరు పత్రాలు అందజేశారు. అంతలోనే ఎన్నికల కోడ్ అమల్లోకి రాగా, మిగిలిన ప్రక్రియ నిలిచిపోయింది. దీనిపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

అయోమయంలో లబ్ధిదారులు

గత బీఆర్ఎస్ ప్రభుత్వం సొంతస్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షలు ప్రకటించింది. స్థలం డాక్యుమెంట్లు కలిగిన ఉన్న వారికే మంజూరు చేస్తామని పేర్కొంది. జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, ఒక్కో నియోజకవర్గానికి 3,000 వేల ఇళ్ల చొప్పున కేటాయించగా, మొదట్లో 500 చొప్పున 2,500 యూనిట్లు మంజూరు చేసింది. వీటిలో ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీ, మైనార్టీలకు 50 శాతం, దివ్యాంగులు 5 శాతం, మిగతావి జనరల్‌కు కేటాయించేలా ఉత్తర్వులు జారీ చేసింది. చాలామంది ప్రభుత్వం కోరిన పత్రాలను సేకరించి కలెక్టరేట్, స్థానిక ఎంపీడీవో, పురపాలక సంఘాల కార్యాలయాల్లో గంటల తరబడి నిరీక్షించి సమర్పించారు. ఇందుకు సంబంధిత పత్రాల కోసం నానా కష్టాలు పడి, క్యూలో గంటల తరబడి నిలబడి మరీ దరఖాస్తులు చేసుకున్నారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఇందిరమ్మ గృహ నిర్మాణం పథకం కింద రూ.5 లక్షలు ప్రకటించింది. సాయం పెంపుపై అంతా హర్షిస్తున్నా.. పాత దరఖాస్తుల్లో అర్హులైన వారికి ఇందిరమ్మ పథకంలో లబ్ధి చేకూరుస్తారా..? లేక తిరిగి దరఖాస్తులు తీసుకుంటారా..? ఈ విషయమై మళ్లీ ప్రక్రియ మొదలుపెట్టి పూర్తయ్యే వరకు ఎంతకాలం అవుతుందోననే ఆందోళన ఆయా వర్గాల ప్రజల్లో వ్యక్తం అవుతోంది.

మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మేడిపల్లి సీఐ సైదులు

మేడిపల్లి: ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని మేడిపల్లి సీఐ సైదులు తెలిపారు. పంతాలు, పట్టింపులకు పోకుండా భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని కేసులను రాజీ చేసుకోవాలన్నారు. అదాలత్‌లో పాత కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి పంపకాలు, భార్యాభర్తల తగాదాలు, బ్యాంక్ రికవరీలు, చెక్‌బౌన్స్ కేసులు, డ్రంకెన్ డ్రైవ్ కేసులు, గొడవలు, రోడ్డు ప్రమాదం కేసులు, పేకాట, మద్యం అక్రమంగా విక్రయించే కేసులు తదితర వాటిని పరిష్కరించుకోవచ్చని అన్నారు. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం విషయంలో ఏవైనా సందేహాలు ఉంటే మేడిపల్లి సీఐ సైదులు, సెక్టార్ ఎస్సైలను సంప్రదించవచ్చని అన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వినతి

బోడుప్పల్: హేమానగర్ కాలనీలో రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ 11వ డివిజన్ ఇన్‌చార్జి మాడుగుల శివయాదవ్ సోమవారం కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. రోడ్డు నంబర్–3, 4లో రోడ్డు తవ్వి వదిలేయడంతో కాలనీ ప్రజలు రాకపోకలు కొనసాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతేగాకుండా కొన్నిసార్లు డ్రైనేజీ పొంగి పొర్లుతోందని, దీంతో దుర్వాసన వెదజల్లుతుందన్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టి కాలనీ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వినతి పత్రంలో కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో గిరి, హరిపాల్‌రెడ్డి, మురళీకృష్ణ, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు అర్హత



నేషనల్‌కు ఎంపికైన లయోలా విద్యార్థులు

అల్వాల్: ఉస్మానియా యూనివర్సిటీ పురుషుల ఫుట్‌బాల్ జట్టు 1995వ సంవత్సరంలో ఆల్ ఇండియా చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించారు. మళ్లీ 28 సంవత్సరాల విరామం తర్వాత అల్–ఇండియా ఇంటర్–యూనివర్సిటీ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించారు. ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు కర్ణాటకలోని మంగళూరులోని యెనపోయ విశ్వవిద్యాలయంలో జరిగిన సౌత్ ఈస్ట్ జోన్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో వారు నాల్గో స్థానంలో నిలిచారు. సౌత్ ఈస్ట్ జోన్ ఛాంపియన్‌షిప్ విజేతలతో పాటు ఉస్మానియా యూనివర్సిటీ మూడవ జాతీయ స్థాయికి అర్హత సాధించింది. లయోలా అకాడమీ నుంచి సాయి దుర్గ, హుస్సేన్, అభిషేక్, కరణ్ క్లారెన్స్ ఉస్మానియా యూనివర్సిటీ తరఫున నేషనల్ టీమ్‌కు ఎంపికయ్యారు. ఫాదర్ ప్రిన్సిపాల్ డాక్టర్.ఎల్. జోజిరెడ్డి ఎస్‌జే, ఫాదర్ వైస్ ప్రిన్సిపాల్ ఎమ్.జోసెఫ్ కుమార్ వారిని అభినందించారు. ఫిజికల్ డైరెక్టర్లు సి.సందీప్‌రెడ్డి, గ్రీష్మపున్న సహకారంతో విజయం సాధించారని అకాడమీ తెలిపింది.

దివ్యాంగులకు అండగా ఉంటాం

కళ్యాణమస్తు చారిటబుల్ ట్రస్టు



దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న బన్నాల ప్రవీణ్ తదితరులు

ఉప్పల్: ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని చిలుకానగర్ డివిజన్ కళ్యాణపురి కమ్యూనిటీ హాల్‌లో దివ్యాంగుల కళ్యాణమస్తు కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేడీ ఫౌండేషన్ కార్యదర్శి కవితారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. దివ్యాంగుల కుటుంబాలకు దుప్పట్లను పంపిణీ చేశారు. దివ్యాంగులకు ఎలాంటి అవసరాలు ఉన్నా కళ్యాణమస్తు చారిటబుల్ ట్రస్టును సంప్రదించాలని తెలిపారు. ఎవరికి ఏ ఆపద వచ్చినా అందరికీ అండగా ఉంటామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఛాయాదేవి, బండి బాలరాజ్, శ్రీవల్లి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ప్రజావాణిలో ఫిర్యాదు



అక్రమ నిర్మాణాలపై ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న సీపీఐ నాయకులు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని సీపీఐ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేషన్ పరిధిలో అనుమతులు లేకుండా అనేక నిర్మాణాలు కొనసాగుతున్నాయని, వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఐ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చకిషన్ సోమవారం పలువురితో కలిసి మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రచ్చ కిషన్ మాట్లాడుతూ.. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఆదాయానికి గండి కొట్టేలా అనుమతులు లేకుండా వివిధ డివిజన్లలో సెల్లార్లు, భారీ షెడ్ల నిర్మాణాలు కొందరు అధికారుల ప్రమేయంతోనే జోరుగా కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ నిర్మాణాలపై అధికారులకు పలువురు ఫిర్యాదు చేసినా స్పందన శూన్యం అని ఆయన విమర్శించారు. కిషన్, బూతం ఐలయ్య, మాచర్ల కనకయ్య, నాగరాజు తదితరులు ఉన్నారు.

మురికివాడల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి



చిల్డ్రన్ పార్లమెంట్‌లో మాట్లాడుతున్న అమూల్య



చిల్డ్రన్ మాక్ పార్లమెంట్‌కు హాజరైన ప్రముఖులు

– చిల్డ్రన్ పార్లమెంట్ తీర్మానం

రామంతాపూర్: గ్రేటర్ హైదరాబాద్ మురికివాడల పిల్లల ఫోరం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మౌంట్‌ఫోర్టు సోషల్ ఇనిస్టిట్యూట్‌లో నగరంలోని 30 మురికివాడలకు చెందిన 1200 మంది పిల్లలతో చిల్డ్రన్ పార్లమెంట్ నిర్వహించారు. ఇందులో ప్రధానమంత్రిగా అమూల్య, స్పీకర్‌గా శ్రీరామ్, ఉప ప్రధానిగా విక్రమ్ కుమార్‌తో కూడిన ఈ బాలల పార్లమెంట్‌లో మురికివాడల్లో తాగునీటి వసతి కల్పించడమే కాకుండా పారిశుద్ధ్యం, భూగర్భ డ్రైనేజీ వంటి అభివృద్ధి పనులు చేపట్టాలని తీర్మానించారు. అభివృద్ధి చెందిన కాలనీలను మరింత అభివృద్ధి చేసేందుకు ఆసక్తి చూపుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు మురికి వాడలను పట్టించుకోవడం లేదన్నారు. నగరంలో స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నారు. తెలంగాణ, ఏపీ బ్రిటీష్ హైకమిషనర్ గారెత్, ప్రొఫెసర్ హరగోపాల్, డాక్టర్ మమతా రఘువీర్, క్రిస్టఫర్, నళిని, ఎమ్మెల్సీ డైరెక్టర్ వర్గీస్ టేకనాథ్, చిల్డ్రన్ పార్లమెంట్ కో ఆర్డినేటర్ వాసు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్

ఉప్పల్: చిలుకానగర్ బాలాజీ ఎన్‌క్లేవ్‌లో రూ.17 లక్షలతో ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ సోమవారం జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను కోరారు. నాణ్యత విషయంలో రాజీపడేది లేదని అధికారులకు సూచించారు. చిలుకానగర్ డివిజన్‌ను ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

ఉప్పల్: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ దేవేందర్‌నగర్‌లో సుమారు 45 సంవత్సరాలు వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి(యాచకుడు) మృతి చెంది ఉన్నాడనే సమాచారంతో ఉప్పల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

మేడ్చల్: గత ప్రభుత్వంలో మంజూరైన కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే మల్లారెడ్డి పంపిణీ చేస్తారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ అధికారులు తెలిపారు. నియోజకవర్గంలోని ఘట్‌కేసర్, శామీర్‌పేట, కీసర మండలాల్లో లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తారని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయాల్లో ఉదయం 9.30 గంటలకు శామీర్‌పేట్ 10గంటల కీసరలో నిర్వహించే సమావేశంలో ఎమ్మెల్యే లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తారని తెలిపారు. 10.30గంటలకు ఘట్‌కేసర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, 11 గంటలకు జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లలో చెక్కులను పంపిణీ చేస్తారని తెలిపారు.

'అనురాగ్'లో స్టూడెంట్ చాప్టర్ ప్రారంభం

ఘట్‌కేసర్: అనురాగ్ యూనివర్సిటీ–హైదరాబాద్ ఐఈఈఈ రోబోటిక్స్ అండ్ ఆటోమిషన్ సొసైటీ, నానోటెక్నాలజీ కౌన్సిల్ స్టూడెంట్ బ్రాంచ్ చాప్టర్‌ను వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ క్యాంపస్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులు సోమవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా డాక్టర్ జే.సుదర్శన్, సంతోశ్ శివ సుబ్రమణి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి చాప్టర్ అనేది రోబోటిక్ అండ్ ఆటోమిషన్, నానోటెక్నాలజీ అనే రెండు విశిష్ట రంగాల సమ్మేళనం అన్నారు.

సీఎంఆర్‌లో హరితహారం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్ కళాశాలలో సోమవారం హరితహారం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ నాగరాజు నాయక్, అధ్యాపకులు రోహిణిరెడ్డి, వెంకటేశ్వర్లు, విజయ శాంతి, సౌజన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

అయ్యప్పను పూజిస్తే అన్నీ శుభాలే..



అయ్యప్ప స్వామి పూజలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

మల్లాపూర్: అయ్యప్ప స్వామిని భక్తితో పూజిస్తే అన్ని పనుల్లో విజయం సాధిస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మల్లాపూర్ దుర్గానగర్ కాలనీలో పీడీ మూర్తి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో పొన్నాల రాజు, కటార్ల భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

నాలా పనుల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ సర్దార్ పటేల్‌నగర్‌లో జరుగుతున్న నాలా పనులను స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో జాప్యం జరగకుండా చూడటంతో పాటు నాణ్యత పాటించేలా కాంట్రాక్టర్‌కు సూచించామన్నారు. అధికారులను కూడా నిరంతరం పర్యవేక్షణ చేయాల్సిందిగా ఆదేశించామన్నారు. కార్యక్రమంలో డీఈ వేదకుమారి, వీఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బాలాజీ బ్రహ్మోత్సవాలు



అల్వాల్: అల్వాల్‌లోని బాలాజీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ప్రత్యేక హోమం, ధ్వజారోహణ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజా సంజయ్ గోపాల్, ఆలయ ఈవో మఠం వీరేశం, శ్రీనివాస్ పంతులు, వంశీ, గోపాల్, వెంకట్రామిరెడ్డి, శివరామకృష్ణ, రాము, నగేష్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

మౌలాలి: డివిజన్ పరిధిలోని ప్రగతినగర్, మారుతీనగర్‌లో యూజీడీ పనులను సోమవారం కార్పొరేటర్ గున్నాల సునీతశేఖర్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మౌలాలి డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో అభివృద్ధి పనులకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పాండురంగచారి, రమేష్, పవన్, శ్రీనివాస్, ఆంజనేయులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సుబ్రహ్మణ్యషష్ఠి మహోత్సవం



మల్కాజిగిరి: అనంత సరస్వతీనగర్‌లోని జ్ఞాన సరస్వతీ దేవాలయం ఆవరణంలోని సుబ్రహ్మణ్యస్వామి ఉపాలయంలో సుబ్రహ్మణ్యషష్ఠి మహోత్సవం ముగిసింది. సోమవారం ఉదయం విశేష అభిషేకం, సుబ్రహ్మణ్య స్వామి హోమం, సాయంత్రం స్వామి వారి ఊరేగింపు జరిగాయని ఈవో రవీందర్‌రెడ్డి, అర్చకులు రాజశేఖరశర్మ తెలిపారు.